ప్రజాశక్తి

ఆదివారం 9 మార్చి 2025





రైతులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

గుడ్డు.. వెరీ బ్యాడ్..!

అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలకు కోడిగుడ్ల సరఫరాలో కాంట్రాక్టర్లు నిబంధనలకు నీళ్లొదిలారు. కుళ్లిన గుడ్లు, పరిమాణం తక్కువ ఉన్న గుడ్లు సరఫరా చేస్తూ పిల్లలు, గర్భిణుల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారు. కోడి గుడ్ల సరఫరాలో ప్రతి వారం ఒక రంగు గుడ్లపై మార్కు వేయాలి. సరఫరాదారులు నిబంధనలు పాటించడకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల పెనుకొండ, గోరంట్ల మండలాల్లో కుళ్లిన కోడిగుడ్లు సరఫరా అయ్యాయి. నిత్యం ఈ తంతు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

- అంగన్‌వాడీ, పాఠశాలలకు నాసిరకం సరఫరా
- గుడ్డుపై సీలు మాయం
- చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంతో చెలగాటం
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పెనుకొండ

ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశాయి. పిల్లలు విద్యతో పాటు, ఆరోగ్యకర వాతవరణం కోసం ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, పాఠశాలల్లో విద్యార్థులకు బలవర్ధక ఆహారం అందించేందుకు కోడిగుడ్లను సరఫరా చేస్తోంది. కోడిగుడ్లను సరఫరా చేసే బాధ్యత ప్రయివేటు ఏజెన్సీలకు ప్రభుత్వం అప్పగించింది. వీరు కోడిగుడ్ల సరఫరాలో నిబంధనలకు తిలోదకాలు వదులుతున్నారు.

ప్రతి నెల 5 లక్షల కోడిగుడ్లు సరఫరా..

పెనుకొండ నియోజకవర్గం వ్యాప్తంగా అంగన్‌వాడీ, పాఠశాలకు ప్రతి నెలా 5 లక్షల కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. పెనుకొండ మండలంలో ప్రతినెలా 1,02,825, గోరంట్ల 1,32,500, సోమందేపల్లి, రొద్దం, పరిగి మండలాకు 2,64,675 కోడిగుడ్లను అందించాలి.

నిబంధనలకు నీళ్లు...

ప్రతినెలా నాలుగు సార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరాచేయాలి. రవాణాదారులు నెలకు రెండు సార్లు లేదా మొత్తం ఒకే సారే అందిస్తున్నారు. రవాణ బిల్లు మాత్రం నాలుగు మార్లు సరఫరా చేసినట్లు బిల్లు మంజూరు చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి వారం ఒక రంగు కోడి గుడ్లపై మార్కు వేయాలి. నీలం, ఎరుపు, ఆకు పచ్చ, పర్పల్ రంగులు కోడి గుడ్లపై మార్కు వేయాల్సి ఉంది. ఒక వారం వేసిన రంగు, మరో వారం వేయరు. నిబంధనలకు విరుద్ధంగా కోడిగడ్లపై ఎలాంటి రంగులువేయడం లేదు. దీంతో కోడి గుడ్లు పక్కదారిపట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అంగన్‌వాడీల్లో బాలింతలు, గర్భిణీలకు, చిన్నారులకు రోజుకు ఒకటి చొప్పున ఇవ్వాలి. ఒక వారం ఒక రంగ ఉన్న కోడిగుడ్లు సరఫరా చేస్తే మరో వారం వేరే రంగు ఉన్న ముద్రులున్న కోడి గుడ్లు సరఫరా చేయాలి. గుత్తేదారులు మాత్రం రంగులు వేయడం లేదు.

కుళ్లిన గుడ్లు సరఫరా..

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి వారిని ఆరోగ్యవంతులు చేయడమే ప్రభుత్వం లక్ష్యం. గుత్తేదారులు, రవాణాదారులు కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేస్తూ వారి ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. మొన్న పెనుకొండ మండలంలో, నేడు గోరంట్ల మండలలో కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేసినట్లు సంబంధింత అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహకులు, పాఠశాల ప్రధానో పాధ్యాయులు చెబుతున్నారు.

తక్కువ పరిణామంతో కోడిగుడ్లు

గుత్తేదారులు నాణ్యతలేని చిన్న సైజు కోడిగుడ్లను సరఫరా చేస్తున్నట్లు విమర్శలున్నాయి. అంగన్‌వాడీల ద్వారా పంపిణీ చేసే కోడిగుడ్లు ఒక్కోటి 45గ్రాముల నుంచి 50 గ్రాముల బరువుండాలి. ఒక ట్రేలో ఉండాల్సిన 30కోడిగుడ్లు 1350 గ్రాముల నుంచి 1500 గ్రాములు బరువు ఉందాలి. సగటున ఒక్కో గుడ్డు 30 గ్రాములు ఉండగా ట్రే బరువు 1000గ్రాములు దాటడం లేదని ఆరోపణలున్నాయి. నాణ్యత లేని తక్కువ బరువు ఉన్న గుడ్లను పంపిణీ చేయడం ద్వారా కావాల్సిన స్థాయిలో పోషకాలు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



చర్యలు తీసుకోవాలి

కుళ్లిన, పరిమాణం తక్కువ ఉన్న కోడి గుడ్లను సరఫరా చేస్తున్న గుత్తేదారులు, రవాణాదారుడుపై చర్యలు తీసుకోవాలి. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ప్రాణాలతో చెలగాటం అడడం దారుణం. దీనిపై జిల్లా అధికారులు దృష్టిసారించి కఠిన చర్యలు తీసుకోవాలి.

హరి, సిపిఎం నాయకులు, పెనుకొండ.



కుళ్లిన కోడిగుడ్లు

అదానీ ప్రాజెక్టుతో రైతులకు నష్టం

- పంట పొలాలు నిర్వీర్యం అయ్యే పరిస్థితి
- రైతుల కోసం 10న చలో పుట్టపర్తి
- ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న

ప్రజాశక్తి-తాడిమర్రి

శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండల పరిధిలోని దాడితోట, చిలకొండయ్యపల్లి, పెద్దకోట్ల గ్రామ సరిహద్దుల్లో ఏర్పాటు చేస్తున్న అదానీ 500 మెగావాట్ల హైడల్ పవర్ ప్రాజెక్టుతో స్థానిక రైతులకు తీవ్ర నష్టం వాటిల్లితోందని ఎపి రైతుసంఘం నాయకులు విమర్శించారు. ఈ ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీన రైతుసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చలో పుట్టపర్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ దాడితోట, చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల గ్రామాలలో శనివారం పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. రైతులను కలిసి అదానీ హైడల్ ప్రాజెక్టు వద్ద కలిగే నష్టాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా పలువురు రైతులు ఆ ప్రాజెక్టుతో తమ పొలాలన్నీ బీడుగా మారుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ ప్రాజెక్టు ఏర్పాటు నిమిత్తం పగలు రాత్రి తేడా లేకుండా పెద్ద ఎత్తున బ్లాస్టింగ్ చేస్తున్నారని చెప్పారు. ప్రాజెక్టు ఏర్పాటు కోసం 400 ఎకరాల కొండను ప్రభుత్వం అదానీ ప్రాజెక్టుకు అప్పగించిందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఆ కొండ చుట్టూ గ్రామాల సాగులో ఉన్న భూములు నిస్సారం అయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. భారీ పేలుళ్లతో చిల్లకొండాయపల్లి సమీప గ్రామాల్లో భూమి పొరలు మూసుకుపోయి భూగర్భ జలాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయన్నారు. గతంలో పుష్కలంగా వచ్చే బోరుబావులు ఎండిపోయాయన్నారు. బోర్లలో నీరు లేక సాగు చేసిన పంటలన్నీ చేతికందకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామాల సమీపంలో 10 టిఎంసిలతో డ్యాం ఉన్నా బోరుబావులు ఎండిపోతున్నాయంటే అదానీ పరిశ్రమ ఎంత నష్టం చేస్తోందో అర్థం చేసుకోవచ్చన్నారు. సమీప ప్రాంతంలో ఏ రైతును అడిగినా అదానీ పరిశ్రమ వల్ల వచ్చే నష్టాన్ని తెలియజేస్తున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన పుట్టపర్తిలో చేపట్టిన చలో కలెక్టరేట్ ధర్నాలో మండలంలోని రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి, జిల్లా కమిటీ సభ్యులు పోతలయ్య, వెంకటస్వామి, జిల్లా నాయకులు జెవి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడి కోనేరు పనులు పూర్తి చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ప్రముఖ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించిన కోనేరు పనులను వెంటనే పూర్తి చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్. నరసింహులు శనివారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కోనేరు ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుండి ప్రారంభం కానున్న సందర్భంగా కోనేరు పనులను పూర్తి చేయాలన్నారు. ఆరు సంవత్సరాల నుండి కోనేరు బాగు చేయడంలో అటు ప్రభుత్వం, దేవాదాయ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు కోనేరు బాగు చేసి భక్తుల మనోభావాలను దెబ్బతినకుండా చూడాలన్నారు. గోశాలలు లేకున్నా గోశాలకు నిధులు సేకరించడం ఎంతవరకు సబబు అని వారు ప్రశ్నించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎక్కడ చూసినా గోవులు తిరుగుతూ వాహనాల కింద పడి తీవ్ర గాయాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. ఆలయ ఈవోలు కానీ, అధికారులకు గాని స్పందించిన పాపాన పోలేదని వారు విమర్శించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతు పనులు చేసి కోనేరుని మంచినీటితో నింపాలని సిపిఎం నాయకులు దేవాదాయశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా బ్రహ్మోత్సవాలకు వచ్చే వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నాయకులు జిఎల్ నరసింహులు బాబ్జాన్ తదితరులు కోరారు.

రాజీ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రాజీ కాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం చూపుతుందని పుట్టపర్తి జూనియర్ జడ్జి కె. రాకేష్ అన్నారు. శనివారం జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన పుట్టపర్తి లో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా 143 కేసులు పరిష్కరించబడ్డాయి. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ మాట్లాడుతూ కేవలం చిన్న పాటి తగాదాలు మనస్పర్థలు మూలంగా పట్టింపులకు పోయి కేసులు నమోదుచేసుకొని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోకుండా కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా కేసులకు పరిష్కారం చూపుతున్నామన్నారు. పెండింగ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరగడం తో కోర్టులకు పనిభారం అధికమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి బార్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు నాగేంద్ర, నిడిమామిడి శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ రెడ్డి, లెక్కల యదుభూషన్, చల్లా చంద్ర శేఖర్, భారతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

హిందూపురం : రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక న్యాయస్థానాలలో జాతీయ మెగాలో క్ అదాలత్ నిర్వహించి 255 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి హారిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యలతో కలిసి అదనపు జిల్లా జడ్జి లోక్ అదాలత్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కక్ష దారులు వ్యయప్రయాసాలకు గురి కాకూడదన్న ఉద్దేశంతో ఉన్నత న్యాయస్థానాలు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు లోక అదాలత్ లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మూడు బెంచ్ లను ఏర్పాటు చేసి వివిధ రకాల 255 కేసులు పరిష్కరించారు. రూ.1,23,50,000 విలువచేసే 9 సివిల్ కేసులు పరిష్కరించగా ఆరు ప్రమాద బీమా కేసులు ద్వారా రూ.44,35,000లకు పరిష్కారమయ్యాయి. అదేవిధంగా 66 ఐపిసి కేసులు, 92 మద్యం కేసులను పరిష్కరించి రూ.4,74,025 అపరాధ రుసుం విధించారు. 9 ఇసుక అక్రమ రవాణా కేసులను పరిష్కరించి రూ. 28వేల అపరాధ రుసుం విధించారు. రెండు భరణం కేసులను పరిష్కరించి బాధితులకు రూ. 10 లక్షలు ఇప్పించారు. అదే విధంగా మూడు గృహహింస కేసులు పరిష్కారమయ్యాయి. ఒక చెక్ బౌన్స్ కేసును పరిష్కరించి బాధితుడికి రూ.1.20 లక్షలు ఇప్పించారు. కాగా రూ.61,700 విలువ చేసే తొమ్మిది ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించారు. ఇకపోతే 58 చిన్నపాటి కేసులను పరిష్కరించి రూ.1,12,100 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ నగేష్, ఏజిపి శ్రీనివాస్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, లోక అదాలత్ సభ్యులు నాగరాజు, సతీష్, సుధాకర్, నవేరా, ఉదయ్ సింహారెడ్డి, సంతోషి కుమారి లతోపాటు లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద న్యాయవాదులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి లోకేష్

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవానికి కూటమి ప్రభుత్వం తరపున విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ వెల్లడించారు. శనివారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కందికుంట మాట్లాడారు. ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్రమంత్రి నారా లోకేష్ రావడం మరింత సంతోషంగా ఉందన్నారు. ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లన్నీ జరుగుతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు ప్రజా సంఘాలు ఆధ్యాత్మిక సేవ సంఘ సభ్యులు అందరూ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారి వివిఎస్ శర్మ, సంబంధిత అధికారులు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచి భాగ్యమ్మ

కెరికెర సర్పంచికి ఉత్తమ మహిళా సర్పంచిగా అవార్డు

ప్రజాశక్తి-హిందూపురం


హిందూపురం రూరల్ మండలం కిరికెర పంచాయితీ సర్పంచ్ వైఎన్ భాగ్యమ్మ ఉత్తమ మహిళా సర్పంచ్ అవార్డు అందుకుంది. శనివారం ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమిషనర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా పంచాయతీ స్వశక్తి అధినేత్రి ఉత్తమ పురస్కారంను అందుకున్నది. ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో రాష్ట్రం నుండి ఆరుగురు మహిళ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లా నుండి కిరికెర గ్రామపంచాయతీ సర్పంచి భాగ్యమ్మ ఒక్కరే పాల్గొన్నారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వై ఎన్ భాగ్యమ్మ మహిళా సాధికారత, ఫ్రెండ్లీ ఉమెన్, గ్రామ పంచాయతీల అభివృద్ధి గురించి ప్రసంగించారు. జాతీయ స్థాయిలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఎంతో మంది మహిళా మేధావులు పాల్గొన్నారు. భాగ్యమ్మ చేసిన ప్రసంగం అక్కడున్న మహిళలను ఎంతగానో ఆకట్టుకుంది. పంచాయతీ పేరును దేశ వ్యాప్తంగా చాటినందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్పంచులు, ప్రజలు ఆమెను అభినందిస్తున్నారు.

రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువు రైతుల సౌకర్యార్థం రూ.3కోట్లతో రైల్వే పాస్ నిర్మాణ పనులకు సెంట్రల్ రైల్వే అధికారులు ఆమోదం తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో రైతుల పొలాలకు వెళ్లేందుకు కొత్త చెరువు రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి అడుగుల పడ్డాయి. ఈ మేరకు కేంద్ర సహాయమంత్రి సోమన్న ఆదేశాల మేరకు బెంగళూరు సదరన్ రైల్వే అధికారులు శనివారం కొత్తచెరువుకు వచ్చారు. రైల్వే అండర్ పాస్ కింద భారీగా నిలుస్తున్న వర్షపు నీరు బయటకు పంపించేందుకు ప్రత్యేక పైప్లైన్ ను ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా రైతుల పొలాలకు వెళ్లేందుకు రైల్వే లైన్ కింద 20 అడుగుల వెడల్పుతో 11 అడుగుల ఎత్తుతో అదనంగా నూతన అండర్ పాస్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర రైల్వే అధికారులు ఆమోదించిన ఈ పనులను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి రైల్వే ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్



మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ టిఎస్. చేతన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పుట్టపర్తి మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి శ్రీనివాస ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రత్న, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ వరలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిపిఒ సమత, డిఎంహెచ్ఒ ఫిరోజ్‌బేగం మెప్మా అధ్యక్షురాలు పద్మావతి, జిల్లా మహిళ సమైక్య అధ్యక్షురాలు రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలకు మైనార్టీ తీరిక ముందే పెళ్ళిళ్ల చేస్తున్నారని జిల్లా లో ఎక్కడ బాల్య వివాహాలు జరుగకుండా గ్రామంలోని ప్రతి ఒక్క మహిళా ప్రభుత్వానికి తోడ్పాటు అందించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మహిళల హక్కులు, సామాజిక ఆర్థిక సాంస్కృతిక, రాజకీయ సహకారాలపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ చట్టాల పైన మహిళలకు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కుటుంబాన్ని అభివృద్ధి చేయడంలో మహిళల పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. డిఆర్ డి ఏ ద్వారా మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సబికులచే జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరి కిరణ్, మెప్మా ప్రతినిధులు, డిఆర్‌డిఎ, వెలుగు సిబ్బంది, అధికసంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం మెప్మా పనితీరు భేష్

హిందూపురం: జిల్లాలో పట్టణ పేదరిక నిర్మూల సంస్థ మెప్మా పనితీరు సంతృప్తికరంగా ఉందని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ తెలిపారు. శనివారం పుట్టపర్తి బ్రాహ్మణపల్లి సాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హిందూపురం పురపాలక సంఘ మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రాంతంలో స్వయం సహాయక సంఘ సభ్యుల ఆర్థిక బలోపేతం కొరకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి మెప్మా మహిళా సంఘ సభ్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కూడా మెప్మా ద్వారా ఉత్పత్తి అవుతున్న వస్తువులను, ఫుడ్ సెక్టార్ సర్వీస్ సెక్టార్లను హ్యాండీక్రాఫ్ట్ లను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఉమ్మడి జిల్లాల ఏవో పద్మావతి, హిందూపురం మెప్మా డిఎంసి గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై బెదిరింపులు తగదు : సిఐటియు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

తమ హక్కులను సాధించుకోవడం కోసం అంగన్వాడీలు శాంతియుతంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడితే దానిని అడ్డుకోవడానికి సంబంధిత అధికారులే ప్రయత్నిస్తున్నారని అంగన్వాడీలను బెదిరిస్తూ మెసేజ్లను పంపించడం సబబు కాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులతో మూడు సంఘాల కలిసి సమావేశం జరిపి సంబంధించిన సమస్యల మీద రాతపూర్వకంగా సమాధానం ఇవ్వకపోవడంతో మార్చి 10న చలో విజయవాడ వెళు న్నామని పర్మిషన్ తీసుకోవడం జరిగిందన్నారు. వీటిని అధికారులు గమనించాలన్నారు. సమస్యలు పరిష్కరిస్తామనిచెప్పి మాట తప్పడం సంబంధించిన మంత్రికి, అధికారులకు చెల్లదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్ వాడీలకు వేతనాలు పెంచి, గ్రాట్యూట్ అమలు మరిచి, మినిసెంటర్లను మెయిన్ సెంటరుగా మారుస్తూ జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు బెదిరింపులకు అంగన్వాడి వర్కర్లు ఎవరు భయపడకుండా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించిన ఫలితంగా 6 జీవోలు సాధించుకున్న వేతనాలు పెరగలేదన్నారు. మినిట్స్ కాపీ ఆధారంగా జూలై నెలలో అంగన్వాడీలకు వేతనాలు పెరగాలని ప్రభుత్వం మారితే అంగన్వాడీల కష్టాలు తీరుతాయని ఆశించామని అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలు దాటిన అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయారు. రకరకాల పెట్టుబడులు పెట్టి సెంటర్లు నిర్వహిస్తున్నారనీ రకరకాల యాప్‌లతో పనిభారం పెరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులు, మంత్రులు, ముఖ్యమంత్రితో సహా సమ్మె శిభిరాలను సందర్శించి అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. ఇటీవల మట్టిఖర్చుల జీవో మినిట్స్ కాపీలో రూ. 20 వేలు ఉంటే రూ. 15 వేలకు మాత్రమే జీవో ఇచ్చారని విమర్శించారు. మినీ సెంటర్లని మెయిన్ సెంటర్లుగామారుస్తున్నామని, ఫైల్ ఫైనాన్స్లో ఉందని గత 8 నెలలుగా చెప్పటం తప్ప ఆచరణలో ఎలాంటి చర్య తీసుకోలేదని ఆగ్రహ వ్యక్తం చేశారు.

హెచ్‌ఎన్ఎస్ఎస్ ద్వారా సోమందేపల్లి చెరువుకు నీరందించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లి పెద్ద చెరువును హంద్రీనీవా కాలువ ద్వారా నీటితో నింపాలని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షులు హరి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం సోమందేపల్లి పెద్ద చెరువు కింద రైతులు వేసిన పంటలను ఆయన పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చెరువు కింద సుమారు 500 ఎకరాల ఆయకట్టు ఉందని 250 మందికి పైగా రైతులు వరి సాగు చేస్తున్నారని అన్నారు. ఈ చెరువుకు కేవలం 100 మీటర్ల దూరంలో అందరినీ హంద్రీనీవా కాలువ వెళ్తోందని దీని ద్వారా ఎలాగైనా ప్రభుత్వం చెరువును నీటితో నింపాలని కోరారు. ఈ చెరువులో ఒక ప్రైవేట్ కంకర మిషన్ కోసం చెరువు సంబంధించిన భూమిలో రోడ్డు వేశారని వారి ప్రయోజనాల కోసమే ప్రభుత్వం చెరువులోకి నీళ్ళు వదలడం లేదని విమర్శించారు. వర్షాలతో చెరువు నిండితే క్వారీ యజమానులు మరువను కూడా చూడటానికి వీలు లేకుండా కంచవేసి మరువ దగ్గరికి ప్రజల్ని రానీయకుండా చేస్తున్నారని ఇది దుర్మార్గమైన చర్యఅని అన్నారు. రైతు సమస్యలపై ఈనెల 12వ తేదీన జరిగే మహా ధర్నాకు మండలంలోని రైతులంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘ నాయకులు భాస్కర్, సిపిఎం మండల కార్యదర్శి రంగప్ప, నాయకులు రాజగోపాల్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, కిష్టప్ప రామకృష్ణ, నాగభూషణ, గోవిందప్ప, రైతులు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి www.prajasakti.com

వడ్డెర్లకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

వడ్డెర్లకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని వడ్డెర్ల సంఘం నాయకులు అన్నారు. శనివారం వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు వడ్డే శ్రీనివాసులు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల గోవిందరాజు విలేకరులతో మాట్లాడుతూ వడ్డెర సమాజానికి రాజకీయ న్యాయం చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి అండగా నిలుస్తూ వచ్చిందని నందమూరి తారక రామారావు పిలుపుతో, వడ్డెర సామాజిక వర్గం పూర్తిగా తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉందని అన్నారు. ఈ సమావేశం లో గుట్టూరు పల్లవరాజు, వడ్డే నారాయణప్ప, వడ్డే యల్లప్ప, వడ్డే చంద్ర తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణం ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి కొత్తచెరువు రూరల్

కొత్తచెరువు మండలానికి చెందిన మామిళ్లకుంట క్రాస్ రేషన్ కార్డులు కలిగిన పలువురు లోచర్ల పంచాయతీ గుంటిపల్లి గ్రామానికి వెళ్లి రేషన్ తీసుకునే వారు. అయితే ప్రస్తుతం మామిళ్ళకుంట క్రాస్ లోనే రేషన్ సరుకులు అందించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. అధికారుల నిర్ణయం పట్ల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 350 మంది రేషన్ కార్డు లబ్ధిదారులు సుమారు దశాబ్ద కాలంగా పక్కనే ఉన్న గుంటి పల్లికి వెళ్లి బియ్యం తెచ్చుకునే వారు. ఈ సందర్భంగా కార్డు దారులు అనేక ఇబ్బందులు పడేవారు. దీన్ని గుర్తించిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. 3 నెలల క్రితం మామిళ్ళకుంట క్రాస్ గ్రామంలో ప్రభుత్వ చౌక దుకాణం ఏర్పాటు చేయాలని స్థానికులతో కలిసి తహశీల్దార్‌ను కోరారు. స్పందించిన అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. దీంతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి సాకే వెంకటేష్, వ్యవసాయ మహిళా సంఘం జిల్లా నాయకురాలు రమాదేవి, స్థానికులు పోతక్క, చిన్నగమ్మ, గౌరమ్మ, లక్ష్మమ్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, సంచాలకులు విజయవాడ వారి ఆదేశాల మేరకు మెగా డిఎస్సీ పరీక్షల కొరకు ఆన్-లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వెనుక బడిన తరగతుల జిల్లా అధికారిని నిర్మలా జ్యోతి తెలిపారు. టెట్ (టీచర్ ఏలిజిబిలిటి టెస్ట్) పరీక్షలో అర్హత సాధించిన వారికి శ్రీ సత్య సాయి జిల్లా వాసులకు మాత్రమే బిసి, ఇబిసి కేటగిరీలకు చెందిన అభ్యర్థుల నుండి మెగా డి.యస్.సి. పరీక్షల కొరకు ఉచిత ఆన్-లైన్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. మార్చి 10వ తేదీ నుండి దరఖాస్తు పత్రాలను తమ కార్యాలయము నుండి పొందవచ్చునని చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబరు 9392141545లో సంప్రదించాలని చెప్పారు.

14న చలో పిఠాపురం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 14న పిఠాపురంలో జరుగుతుందని జనసేన వీర సైనికులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన నాయకులు, కార్యకర్తలు చలో పిఠాపురానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావ గోడ పత్రికలను విడుదల చేసి మండలాల వారిగా కమిటీలు వేసి వారి బాధ్యతలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, నాయకులు మహేష్, రాము, దాసరి శ్రీనివాసులు, గోవర్ధన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 550 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అందులో 245 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు నిర్ధారించారు. ఈ కార్యక్రమం వైద్య నిపుణులు రేణు, సంగీత, ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ కుమార్ రాజా, సంస్థ కార్యదర్శి ఉషారాణి, వైద్య శిబిర పర్యవేక్షకులు శివ శంకర్, వాలంటీర్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని సి అండ్ ఐ జి మిషన్ చర్చ్, మిషన్ కాంపౌండ్ సంఘ నిర్వహణ బాధ్యతల కోసం శనివారం సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘ పాస్టర్, ప్రెసిడెంట్ రెవ. డాక్టర్ స్టీఫెన్ రాజు తెలిపారు. వీరు రాబోయే రెండు సంవత్సరములు బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు.

'పది' విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పదవ తరగతి పరీక్షలు ఈనెల 15వ తేదీ నుంచి 31 వరకు జరుగుతున్న సందర్భంగా ఆర్టీసీ యాజమాన్యం విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయవాడ నుంచి శనివారం ఉత్తర్వులు ఇచ్చినట్లు డిపో మేనేజర్ ఇనయతుల్లా తెలిపారు. ఈనెల 17 నుంచి 31 వరకు పరీక్షలు ఉన్న రోజులలో ఈ ఉచిత బస్సు ప్రయాణం అనుమతించబడుతుందన్నారు. కేవలం హాల్ టికెట్ ఆధారంగా ఏ విధమైన బస్సు పాసు లేకపోయినా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సులలో ఉచిత ప్రయాణం అనుమతించబడుతుందన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి కల్పించిన ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

గిట్టుబాటుకై పోరుబాట..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఎపి రైతు సంఘం పోరుబాటను ప్రారంభించింది. ప్రధానంగా మిర్చి పంట ధరలు విపరీతంగా పడిపోయాయి. జిల్లాలో సుమారు 60 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగవుతుంది. అందులో ఆర్థిక మంత్రి ప్రాతినిధ్యం వహించే ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోనే అధికంగా ఉంటుంది. ఇందులో ఎక్కువ మంది కౌలు రైతులుఉండటం గమనార్హం. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను కాపాడుకుని దిగుబడులు సాధించాక ధరల్లేక రైతు తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో మార్కెట్‌కు అమ్ముకుందామని పోయిన రైతులు ధరలేకపోవడంతో కోపోద్రోక్తులై కర్నాటక మార్కెట్ యార్డును తగులబెట్టేందుకు సిద్ధమయ్యారు. అందులో అనేక మంది పోలీసు కేసుల్లోనూ చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారు. గత అనుభవాన్ని చూసి అయినా రాష్ట్ర ప్రభుత్వం ఈసారి మేలుకోలేదు. ధర లేక ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని సీజన్ ప్రారంభంలోనే డిఆర్‌సి సమావేశంలోనూ చర్చకొచ్చింది. ప్రభుత్వంలో ఎటువంటి స్పందనా కలుగలేదు. మిర్చి రైతుకు గిట్టుబాటు కల్పించడం తమ చేతుల్లో లేదన్నట్టుగా ఉంటూ వచ్చారు. ఇక రాజకీయంగానూ ఇది పెద్ద చర్చనీయాంశమవుతున్న సమయంలో 'సేకరిస్తామని ప్రకటించింది. సేకరణలోనూ అనేక షరతులు, నిబంధనలున్నాయి. దీంతో రైతులు ఇప్పటికీ అవస్థలు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎపి రైతుసంఘం పాదయాత్రను ఉరవకొండ నుంచి ప్రారంభించింది. రెండు రోజులుగా రైతులను కలుస్తూ వస్తున్నారు. ఈనెల 10వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చింది. అంతలోపు ప్రభుత్వం వైపు నుంచి స్పందన వస్తుందా లేదా చూడాల్సి ఉంది. ఇతర పంటల పరిస్థితులు కూడా ఇంచుమించుగా ఇదే రకంగా ఉండటం గమనార్హం. రైతులు గిట్టుబాటు కోసం ప్రభుత్వాలను ప్రాధేయ పడే పరిస్థితులే నెలకొని ఉన్నాయి.

హంద్రీనీవా మొదటి దశ కాలువ వెడల్పు చేయాలని ముందు నుంచి జిల్లావాసులు అడుగుతున్నారు. కాని ప్రభుత్వం మాత్రం వెడల్పు కాకుండా రెండో దశలో లైనింగ్‌కు సిద్ధపడింది. ఇది సరైంది కాదని అటు సిపిఎంతోపాటు, ప్రతిపక్ష వైసిపి నాయకులు కూడా చెబుతున్నారు. లైనింగ్ పనులు చేపట్టడాన్ని నిలిపివేయాలని సూచిస్తున్నారు. లైనింగ్ చేపడితే భూగర్భజలాలు పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని రైతు శ్రేయోభిలాషులందరూ చెబుతున్నారు. కాని ప్రభుత్వం దీన్ని పెడచెవిన పెట్టే విధంగానే కనిపిస్తోంది. అధికారపార్టీ నేతలు మాత్రం



అనంత వీక్షణం

ఈ అంశంపై పెదవి విప్పడం లేదు. సరైందా.. కాదా.. అన్నది కూడా చెప్పకుండా మౌనంగా ఉంటుండటం గమనార్హం.

రాజకీయ అంశాలకు సంబంధించి ఈ వారం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు విజయవాడ పోలీసులు నోటీసులిచ్చారు. దీంతో ఆయన వారి ముందు విచారణకు హాజరయ్యారు. అరెస్టులుండవచ్చునని భావించినా అటువంటిదేమీ జరక్కపోవడంతో వైసిపి శ్రేణులు ఒకింత ఊపిరి పీల్చుకున్నాయి.

పనిఒత్తిడి తగ్గించాలి : గ్రామ సర్వేయర్లు



వినతిపత్రం సమర్పిస్తున్న సచివాలయ సర్వేయర్లు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

'మేమేం మర మనుషులం కాదని, ఒకటి కాదు రెండు కాదు పది రకాల పనులు అప్పగించి నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలంటే ఎలా చేయాలో దిక్కుతోచడం లేదని అందుకు అనుగుణంగా మావద్ద సాంకేతికతను ఉపయోగించుకునేందుకు పరికరాలు కూడా లేవని ఈ నేపథ్యంలో పని భారం తగ్గించాల'ని జిల్లాలోని గ్రామ సర్వేయర్లు వాపోతున్నారు. ప్రతిరోజు రీ సర్వే ఇన్ని ఎకరాలు పూర్తి చేయాలని లక్ష్యం విధిస్తున్నారని, ల్యాప్ టాప్ మండలానికి ఒకటి ఇచ్చి ఈ పనిని ఎప్పటికప్పుడు క్రోడీకరణ చేయాలంటే ఎలా అవుతుందని వాపోయారు. పిజిఆర్ఎస్‌కు రాకపోతే మెమో ఇస్తామని ఒక వైపు తహశీల్దార్లు, రీ సర్వే చేయకపోతే షోకాజు నోటీసు ఇస్తామని ఎంఎస్ ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. రోజుకు 20 ఎకరాలు రీ సర్వే చేయాలని పని భారం మోపడంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలోనూ తమకు ఫలానా సమస్యలు ఉన్నాయని విన్నవించుకునాన పట్టించుకోలేదని ప్రస్తుత ప్రభుత్వం కూడా యధాతథంగా వ్యవహరిస్తుండడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రెవిన్యూ లో జరిగే తప్పులన్నిటికీ తమను బాధ్యులు చేస్తున్నారని, ఉద్యోగోన్నతులు లేని ఉద్యోగంలో కొనసాగుతున్నామని వాపోయారు. ఈ మేరకు వారు పుట్టపర్తి కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఆయన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు గ్రామ సర్వేయర్లు తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేసి సీఎం డిప్యూటీ సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్తామని జిల్లా గ్రామ సర్వేయర్ల సంఘం సభ్యులు చెప్పారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఉపాధి కూలీల సమస్యలపై ఈనెల 12వ తేదీన విజయవాడలో నిర్వహించే మహా ధర్నాను జయప్రదం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా నాయకులు నాగభూషణ కోరారు. ఈ మేరకు వారు మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. కూలీలకు శ్రమ ఎక్కువ ఫలితం తక్కువగా ఉందన్నారు. మండల వ్యాప్తంగా చేసిన పనులకు గాని బిల్లులు ఇవ్వడం లేదన్నారు. అదనపు పని దినాలు కల్పించలేదని విమర్శించారు. చేసిన పనులకు నెలల తరబడి బిల్లులు బకాయిలు ఉన్నాయని అన్నారు. ఉపాధి కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కూలీలతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు శ్రీనివాసులు, రామాంజనేయులు, హరి, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల :ఉపాధి కూలీల సమస్యలపై ఈనెల 12న విజయవాడలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొండా వెంకటేష్, మహిళా కార్మిక సంఘం జిల్లా నాయకురాలు స్వర్ణలత పిలుపునిచ్చారు ఈ సందర్భంగా మండలంలోని వడిగేపల్లి, మందలపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, కూలీలు

పనులను శనివారం పరిశీలించారు. కూలీలసమస్యలను అడిగితెలుసుకున్నారు. కూలీల సమస్యల పరిష్కారానికి ఈనెల 12న జరుగు ధర్నాను జయప్రదంచేయాలని కోరారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - పరిగి

ఈనెల 17 నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు అవసరమైన రైటింగ్ ప్యాడ్, పెన్నులను పరిగి ప్రజాశక్తి విలేఖరి హరిప్రసాద్ కుటుంబ సభ్యులు శనివారం పంపిణీ చేశారు. పరిగి మండలం పైడేటి జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థి గత ఏడాది మండల టాపర్ గా నిలువగా విద్యార్థులను ప్రోత్సహించే విధంగా తన సోదరుడు శివప్రసాద్ జ్ఞాపకర్థం పైడేటి పాఠశాలలో చదువుతున్న 51 మంది విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలకంఠరెడ్డి ఆధ్వర్యంలో ఆగ్ల ఉపాధ్యాయులు రామాంజినేయలు, కృష్ణనాయక్ సమక్షంలో పంపిణీ చేశారు.



విద్యార్థినికి సామగ్రి అందజేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ లో విద్యార్థినిలకు విద్య సామాగ్రి పంపిణీ చేశారు. అనంతపురానికి చెందిన టిడిపి ఎస్సీ సెల్ లీడర్ విజయబాబు సహకారంతో పంపిణీ చేసిన ఈ కార్యక్రమంలో అర్బన్ సిఐ శివరాముడు, హాస్టల్ వార్డెన్ సులోచన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని కాటికాపర్ల సమస్యలను పరిష్కరించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కాటికాపర్లతో కలిసి ఇన్‌ఛార్జి తహశీల్దార్ మారుతికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాటికాపర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వీరి సమస్యల సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 11వ తేదీన విజయవాడలో నిర్వహించే మహా ధర్నాకు మండలంలో ఉన్న కాటికాపర్లు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగభూషణ, కొండా వెంకటేష్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కందుల కొనుగోలు కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని ఆర్. మరవపల్లిలోనిరైస్ మిల్లులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని టిడిపి మండల నాయకులు శనివారం పరిశీలించారు. ఈసందర్భంగానాయకులు మాధవనాయుడు మాట్లాడుతూ మండలం లో రైతులు పండించిన కంది ని మార్క్ ఫెడ్ వారు రైతులకు సమస్యలు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. సాధ్యమైనంత వరకు రైతులందరి కందులను కొనుగోలు చేయాలని మార్క్ ఫెడ్ అధికారులను, ఏజెన్సీ నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, చంద్రమౌళి, టైలర్ ఆంజనేయులు, మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ, వీరాంజి, చంద్రశేఖర్, డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్దన్న, ఉమాశంకర్, పుల్లప్ప, శేషు, నగేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రాత్మకం... ఖాద్రీశుడి ఆలయం

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలోని శ్రీ ఖాద్రి నరసింహ స్వామి దేవాలయం చారిత్రాత్మక ఆలయంగా పరిగణింపబడుతోంది. క్రీ.శ. 1332 సంవత్సరంలో ఈ ఆలయం నిర్మితమైనట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఎత్తయిన రాజ గోపురాలు, చుట్టూ ప్రాకారం, మధ్యలో గర్భగుడి ఉంటాయి. శ్రీదేవి భూదేవిల విరాట్ విగ్రహాలు గర్భగుడికి కుడి పక్కన మరో ఆలయంలో ఉన్నాయి. ఆలయంలో స్వామివారిని నిత్యం ప్రాత కాలమే అభిషేకిస్తారు. ఈ ఆలయ నిర్మాణం చాళుక్యుల కాలంలో మొదలు పెట్టగా విజయనగర సామ్రాజ్య కాలంలో పూర్తి అందినట్లు చరిత్ర కారులు చెబుతున్నారు. ఇంతటి చరిత్ర ఉన్న ఆలయాన్ని మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు సందర్శించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. స్వామివారి ప్రధాన ఆలయంతోపాటు నాలుగు ఉపాలయాలను ఇక్కడ చూడవచ్చు. అలాగే ప్రధాన ఆలయానికి ఈశాన్యంలో పుష్కరిణి ఉంది. ఈ పుష్కరిణిలో స్నానం ఆచరించి అనంతరం స్వామి వారిని దర్శించుకోవడం అనవాయితీ.

పక్షం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు

ఆలయ ప్రాంగణంలోనే కళ్యాణ మంటపం పాఠశాల, యాగశాల, ఆస్థాన మండపాలు నిర్మించారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామివార్ల ఉత్సవమూర్తులను ఆస్థాన మండపంలో కొలువుదీర్చి భక్తుల దర్శనార్థం ఉంచడం సాంప్రదాయం. ఇక్కడ పక్షం రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ప్రతి ఏటా ఫాల్గుణ మాసం బహుళ పౌర్ణమి నాడు స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా రథోత్సవం నిర్వహిస్తారు. రథోత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తజనం తరలివస్తారు. సుమారు రెండు లక్షల మంది రథోత్సవాన్ని తిలకిస్తారనేది ఒక అంచనా.

కరువులోనూ బావిలో తరగని నీరు


కరువు అంటే గుర్తుకు వచ్చేది కదిరి. అలాంటి కరువుకు మారుపేరు అయినా కదిరి ప్రాంతంలో ఓ బావి శతాబ్దాలుగా వీటిని ప్రజలకు అందిస్తోంది. దీనినే పాల బావిగా పిలుస్తుంటారు. కదిరి నరసింహస్వామి దేవాలయానికి సమీపంలో ఈ బావి ఉంది. ఆలయం నుంచి ఐదు కిలోమీటర్ల వెళితే హిందూపురం ప్రధాన రహదారి ప్రక్కనే ఈ బావి ఉంటుంది. శతాబ్దాల క్రితం నిర్మించిన ఈ బావిలో నేటికి నీళ్లు ఉన్నాయి. అనేక బావులు చరిత్ర కాలగర్భంలో కలిసిపోయాయి. మరికొన్ని శిథిలావస్థకు చేరుకుని పూడికతో మునిగిపోయాయి కానీ ఈ బావి ఇప్పటికి ప్రజలకు సేవలు అందిస్తూనే ఉంది. ఈ బానికి సంబంధించిన అనేక కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

కదిరి మల్లెల గుబాళింపు

కదిరి మల్లెల గుబాళింపునకు దేశంలోనే పేరుంది. బ్రహ్మోత్సవాల సమయానికి విరబూసే మల్లెలు మరింత వాసనలు గుబాళిస్తాయి. ప్రాంతంలో మాత్రమే కన్పించే ధవణం, మరువం సౌరభాలు ఖాద్రీశుడికి ఎంతో ప్రీతిపాత్రం. బ్రహ్మరథంలో ఊరేగే శ్రీవారికి ధవనానీ మొక్కుబడిగా సమర్పిస్తారు.ఇటీవలి కాలంలో కదిరి ధవణాన్ని సెంటు, అత్తరు తయారీలో వినియోగిస్తున్నారు. ఈనెల 9న ప్రారంభ మయ్యే ఈ వేడుకలు ఏప్రిల్ 23వ తేదీతో ముగుస్తాయి. ఈ పక్షంరోజులూ శ్రీవారు రోజుకో అవతారంలో దర్శనమిచ్చి, భక్తులకు కనువిందు చేస్తారు. దేశంలోని నవ నారసింహ క్షేత్రాలల్లో ఒక్కటైన కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎంతో ప్రాశస్త్యాన్ని కలిగి ఉంది.

చూడదగ్గ ప్రదేశాలు

శ్రీఖాద్రీ లక్ష్మీనారసింహుడిని దర్శించుకున్న అనంతరం భక్తులు చూడాల్సిన క్షేత్రాలు ఈ ప్రాంతంలో చాలా ఉన్నాయి.



ఖాద్రీశుడి ఆలయం

కదిరి, రాయచోటి మార్గంలో 12 కి.మీ దూరంలో గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని యోగివేమన ఆలయం. అత్యంత విశాలమైన వటువుగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కిన తిమ్మమ్మ మర్రిమాను కూడా ఇదే మార్గంలో నంబులపూలకుంట మండలం గూటిబైలు వద్ద ఉంది. కదిరి-హిందూపురం రహదారిలో పాలబావి ఉంది.ఎంత కరువు వచ్చినా ఈ బావిలో నీరు ఎండిపోకపోవడం దీని ప్రత్యేకత.

అంకురార్పణతో మొదలు..

పదిహేను రోజులపాటు సాగి బ్రహ్మోత్సరాలు అంకురార్పణతో మొదలై తీర్థవారితో ముగుస్తాయి. 9న అందురార్పణ, 10న కళ్యాణోత్సవం, 11న హంసవాహనం, 12 సింహ వాహనం, 13 హనుమంత వాహనం, 14న బ్రహ్మగరుడసేవ, 15 న శేషవాహనం, 16 సూర్య చంద్రప్రభలు, 17న మోహినీ ఉత్సవం, 19న గజవాహనం, 20 బ్రహ్మరథోత్సవం (తేరు), 21 న అలకోత్సవం, 22న తీర్థవారి, 23 పుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

చింత,మామిడి,తోటలకు నిప్పు

రూ. 30 లక్షలు నష్టం

ప్రజాశక్తి - గుడిబండ

మండల పరిధిలోని మందలపల్లి గ్రామానికి చెందిన రైతులు మద్దన్నకుంటప్ప, సన్నమారప్ప,చిక్కన్నకు చెందిన మామిడి, చింత, టెంకాయ చెట్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో తమకు రూ. 30 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ఈ ప్రమాదంలో దాదాపు 10 వేల చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.చిక్కన్నకు చెందిన 35 ఎకరాల్లో ఉన్న చింతా మామిడి టెంకాయ చెట్లు కాలిపోగా మద్దనకుంటప్పకు చెందిన దాదాపు 8 ఎకరాల్లో ఉన్న చెట్లు, సన్నమారప్పకు చెందిన దాదాపు 7 ఎకరాల్లో ఉన్న మామిడి చింత చెట్లు పూర్తిగా కాలిపోయాయని బాధితులు వాపోయారు. ఫైర్ ఇంజన్ వచ్చే సరిగే జరగాల్సిన నష్టం జరిగిందన్నారు. తమకు ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని తమ్మాపురం గ్రామ శివారులోని సపోటా తోటలో పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు సోమశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధర్మవరం డిఎస్పి బి. హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు చేశామన్నారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 30,060 రూపాయల నగదుతో పాటు రెండు మోటార్ సైకిళ్లుస్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పుట్టపర్తిలో టిప్పర్ లారీ బీభత్సం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణంలోని శివాలయం వీధిలో శుక్రవారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో టిప్పర్ లారీ బీభత్సం సృష్టించింది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ ఇంటికి సమీపంలో వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడి ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలపారు. సకాలంలో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారన్నారు. డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా రావడం వల్ల ప్రమాదం జరిగిందని తెలిపారు. పెద్ద ఎత్తున స్థానికులు గుమి కూడడంతో డ్రైవర్ టిప్పర్ ను అక్కడే వదిలి పరారయ్యాడని స్థానికులు చెప్పారు.

రైలులో ప్రయాణికుడు మృతి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి అనారోగ్యంతో ధర్మవరం రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం మృతిచెందాడు. తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా, అత్తూరు తాలూకాకి చెందిన శ్రీనివాసం దురై స్వామి (46)కి మూడు నెలల కిందట తన స్వగ్రామమైన అత్తూరు గ్రామంలో కుక్క కరవడంతో సరిగ్గా చికిత్స చేయించుకోలేదు. అలాగే మహారాష్ట్ర రాష్ట్రంలోని ఒక గ్రామంలోకి బోర్వెల్ పనికి వెళ్లి అక్కడ పని చేసుకుంటూ ఉండేవాడు. కుక్క కరిచి ఇన్ఫెక్షన్ అయ్యి ఆరోగ్యం సరిగా లేక మహారాష్ట్ర నుండి తన స్వగ్రామమైన అత్తూరు తాలూకాకు రైలులో ప్రయాణిస్తూ ధర్మవరం రైల్వే స్టేషన్ వచ్చే సమయానికి మృతిచెందాడు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలంలోని బండ్లపల్లికి చెందిన వినోద్ కుమార్తె రిషిక రెండు రోజుల క్రిందట ప్రమాదవశాత్తు మృతిచెందింది. విషయం తెలుసుకున్న సత్యసాయి జిల్లా కురువ సంఘం నాయకులు సామకోటి ఆదినారాయణ తదితరులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కురువ కార్పొరేషన్ డైరెక్టర్ బులగుండ్ల శ్రీనివాసులు, బండి మంజునాథ్, బుల్లె సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువు పొడిగించాలి

ప్రజాశక్తి-హిందూపురం

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించేందుకు గడువు పొడగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.అదే విధంగా కళాశాల ఫీజులకు సంబంధం లేకుండా డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫీజును కట్టించుకోవాలని కోరారు. శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో 7000 మంది విద్యార్థులు ఉంటే రెండు వేల మంది కూడా ఇంకా పరీక్ష ఫీజులు చెల్లించలేదని తెలిపారు. డిగ్రీ పరీక్ష ఫీజు, అప్పర్ అప్లోడ్ చేయడం కోసం సమయం పొడిగించాలని కోరారు. విద్యార్థుల ఇబ్బందులు గుర్తించి ఎస్కే యూనివర్సిటీ రిజిస్టర్ రమేష్ బాబు, ఎగ్జామినేషన్ కంట్రోలర్ లోకేష్ లు డిగ్రీ పరీక్ష ఫీజు విద్యార్థులు చెల్లించడానికి గడువు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు రమణ, దిలీప్, మహేష్, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మార్షల్ ఆర్ట్స్ పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రస్తుత సమాజంలో ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ పై అవగాహన పెంచుకోవాలని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మార్షల్ ఆర్ట్స్ తరగతులను ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం మహిళలు, యువతులు, బాలికలపై లైంగిక వేధింపులు పెరిగిననేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించిందన్నారు. విద్యార్థినులు మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కరాటే మాస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


ప్రశంసాపత్రాలతో ఉన్న విద్యార్థినులతో ఎస్పీ, తదితరులు



సిఐటియు ఆధ్వర్యంలో ధర్మవరంలో నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహిళల భద్రతకు పోలీసులు పెద్దపీట వేస్తున్నారని జిల్లా ఎస్పీ వి.రత్న పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ హాజరై భారీ కేక్ ను కట్ చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర కీలకమైనదని అన్నారు. మానవ హక్కుల కంటే మహిళా హక్కులకు భారతదేశం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అధిక పని ఒత్తిడి వల్ల మహిళలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారనిఆందోళన వ్యక్తం చేశారు. క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులబారిన పడుతున్న నేపథ్యంలో మహిళలు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని 32 పోలీస్ స్టేషన్ల పరిధిలో 73 మంది మహిళా కానిస్టేబుళ్లకు వృత్తిపరంగా త్వరలో పలు రకాల శిక్షణ ఇస్తామన్నారు. పోక్సో, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ముఖ్యంగా అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా దినోత్సవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన శక్తి యాప్ మహిళల భద్రత విషయంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.ప్రతి పోలీస్ స్టేషన్లో మెన్ హెల్ప్ డెస్క్ నిర్వహిస్తున్నామని మహిళ పోలీసులు సిబ్బంది ఈ డెస్క్ లో అందుబాటులో ఉంటూ మహిళల సమస్యలకు సత్వరం పరిష్కారం లభించేలా కృషి చేస్తున్నారన్నారు. వారోత్సవాల్లో జరిపిన వ్యాసరచన, పెయింటింగ్ , వకృత్వపు పోటీలలో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ, పాఠశాల , కళాశాల విద్యార్థినిలకు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రోత్సాహ బహుమతులు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కిమ్స్ సవేరా హాస్పిటల్ నుంచి వచ్చిన వైద్యురాలు విష్ణు ప్రియాంక, ఆరోగ్య సూత్రాలపై పలు విషయాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్పీ వైద్యురాలిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు, డీఎస్పీలు విజయకుమార్, ఆదినారాయణ, శ్రీనివాసులు, ఎస్పీ సీఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, సిఐలు, ఇందిర, సునీత, సురేష్, ఆర్ఐలు మహేష్ ,వలి, ఆర్ఎస్ఐలు వీరన్న ప్రదీప్ సింగ్, వివిధ కళాశాల విద్యార్థులు మహిళలు బాలికలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ధర్మవరంలో శనివారం సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎస్‌హెచ్ బాషా, టీ.అయుబ్ ఖాన్, ఎల్ ఆదినారాయణ, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు మారుతి ,ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు వి.వెంకటస్వామి, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ ధర్మవరం ప్రాజెక్ట్ కార్యదర్శి డి.చంద్రకళ మాట్లాడుతూ మహిళల హక్కుల గురించి వివరించారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 76,సంవత్సరాలు అయినప్పటికి. దేశవ్యాప్తంగా మహిళలపైన లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. నేర గణంకాలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయన్నారు.ఉమ్మడి జిల్లాల్లో కేసులు నమోదుఅయినప్పటిక. ఆర్థిక సహకారం తోడ్పాటు అందిన వారి సంఖ్య నామమాత్రంగా ఉండటం గమనార్హమన్నారు. బాధిత మహిళలకు కాపాడి. వారికి న్యాయం చేకూర్చే బాధ్యత ప్రభుత్వాలదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఆయాల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ నాగవేణి, సిఐటియు కార్మిక సంఘం నాయకులు జయమ్మ, వేదవతి, ఫాతిమా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : కూటమి ప్రభుత్వంలో మహిళలే మహారాణులు అని పలువురు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో బీసీ సంక్షేమ ఈడబ్ల్యూఎస్ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత క్యాంప్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాతమ్మ, బాలికల హై స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిలతా, మహిళా నాయకురాలు రమణమ్మ, చంద్రకాంతమ్మ, అనసూయమ్మ తదితరులు వక్తలు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అరుణ, హేమలత, సుజాత, శ్రీదేవి, జనసేన సరన్న, జనసేన జయమ్మ, ఎక్స్ ఎంపీపీ అంజనమ్మ, లక్ష్మీదేవి, కుమారమ్మ ,రత్నమ్మ తదితరులతో పాటు డ్వాక్రా మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం పోతుల నాగేపల్లి గ్రామ సచివాలయంలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్నర్ వీల్ క్లబ్, ఐహెచ్ఆర్‌పిసి సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

పుట్టపర్తి అర్బన్ :మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, ఎన్ ఎం యు రాష్ట్ర అధ్యక్షులు పి.వి.రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయి ఆరామంలో ఆర్టీసీ జిల్లా నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రీజినల్ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా కండక్టర్ తిరుపాలమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రమణారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా అసిస్టెంట్ ట్రెజరీ అధికారి పవిత్ర, కేంద్ర విశ్వవిద్యాలయం మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతి కుమారి, ఎన్ ఎం యు జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, నాయకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని బాలాజీ కళ్యాణ మండపంలో ఆర్‌డిటి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా సమాజంలో మహిళలు ఎలా రాణించాలి బాల్య వివాహాలను ఎలా అరికట్టాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సిఐ శివరాముడు, ఎటిఎల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక పివిఎస్ పాఠశాలలో చైర్మన్ పీవీ నాయుడు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది కావేరి, పర్వీన్, పుల్లమ్మ, సునీత నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ట్రయినీ డీఎస్పీ పావని, సిడిపిఒ నాగమల్లేశ్వరి, హెచ్ఎం శకుంతల మాట్లాడుతూ అమ్మాయిలు ఇప్పుడున్న సమాజంలో చాలా జాగ్రత్తగా ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని మహిళలకు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చి పటిష్టంగా అమలు చేసి మహిళలకు భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాస్, వంశీ, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : వృత్తిని దైవంగా భావించి విధులు నిర్వహిస్తున్న మహిళలను గుర్తించి మహిళా దినోత్సవం సందర్భంగా వారికి సత్కరించినట్లు ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ హుస్సేన్ తెలిపారు. శనివారం ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, జిల్లా సెక్రటరీ రామాంజనేయులు, తాలూకా యూనిట్ అధ్యక్షులు ఫకృద్దీన్, యూనిట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయసం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగళి : అగళి విజ్ఞాన భారతి పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శివకుమార్ మాట్లాడుతూ మహిళల హక్కుల గురించి వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులను పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు చంద్రకళ, కవిత, సన్నమ్మ, ఉపాధ్యాయులు నందీష్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో శనివారం ఆర్ డి టి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎటిఎల్ మీనాక్షి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు గురించి,మహిళల చైతన్యం ఆడపిల్లలు మగ పిల్లల చదువుల గురించి, కుటుంబాల మార్పు గురించి, మహిళల హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎటిఎల్ మీనాక్షితో పాటు సిఒ మహేష్, ఏపీ మాస్ రాజగోపాల్, అనిల్, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో కస్తూరిబా గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ నాగరత్నమ్మ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళా దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రూప, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నాయకులు చంద్రమౌళి, రొద్దం బాబు ప్రసాద్ పెనుకొండ రవికుమార్, మునిమడుగు నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట: ఆర్డీటీ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి అంబేద్కర్ నగర్ ఆర్డీటీ కమ్యూనిటీ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ నగర్ కాలనీ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ప్రతినిధులు ధనలక్ష్మి, నరసింహులు, గంగాద్రి, నవీన్‌కుమార్, సర్పంచి అంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మహిళలను గౌరవించినప్పుడే సమాజం ముందుకు వెళుతుందని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎంపీడీవో నరసింహనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ వేడుకలలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జడ్పిటిసి కోటి సుధా, తహశీల్దార్ స్వర్ణలత ముఖ్య అతిథులుగా హాజరై మహిళా దినోత్సవం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు, వెలుగు సిసి ఓబులేసు, మహిళా సంఘాల సభ్యులు, మహిళా ఉద్యోగులు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం హిందూపురం పట్టణంలో కోర్టు, జిల్లా అసుపత్రి, వైసిపి కార్యాలయంతో పాటు సిపిఎం కాలనీ, వివిధ ప్రాంతాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కోర్టు ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లే శైలజ మాట్లాడుతు స్వాతంత్ర్య ఉద్యమంలో స్త్రీ పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి లలితా లక్ష్మి హారికా కోట, మహిళా న్యాయవాదులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అదే విధంగా జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో హిందూపురం వాసవి క్లబ్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సత్య సాయి జిల్లా విభాగం వారు సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరిటెండెంట్ లింగన్న, వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు దాసా సందేష్, జిల్లా డెంటల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ విజయ్ బాబు, డాక్టర్ సురేఖ,క్లబ్ అధ్యక్షులు ఏం రాజేంద్ర గుప్తా, కార్యదర్శి దాసా విష్ణు, కోశాధికారి హెచ్ ఆర్ కిరణ్, క్లబ్ మాజీ అధ్యక్షులు కళ హరి, టీ జి సుబ్రమణ్యం, వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ ఆద్వర్యంలో సిపిఎం కాలనీలో, సప్తగిరి, బాలయేసు ఎన్ఎస్ఎస్ విభాగంలో ఆద్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కళాశాల ప్రిన్సిపల్స్, అద్యాపకులు పాల్గొన్నారు. వైసిపి కార్యాలయంలో నియోజక వర్గ ఇన్‌చార్జ్ దీపిక ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పాల్గోని కేక్ కట్ చేసి అందరికి పంచారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మి, రాధమ్మ, సర్పంచులు లలితమ్మ, భాగ్యమ్మ, కో-ఆప్షన్ కాంతమ్మ, సాహెరా భాను, కవితా రెడ్డి, సిద్ధగంగమ్మ, హరిత రెడ్డి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు. టిడిపి కార్యలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్, కౌన్సిలర్ సతీష్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి రామంజినమ్మ, టౌన్ మహిళా ప్రెసిడెంట్ విజయలక్ష్మి, సిఒ లు నాగేశ్వరి, నర్మదా, మెప్మా ఆర్‌పిలు పాల్గొన్నారు.


పెనుకొండ టిడిపి కార్యాలయంలో....


కదిరిలో మహిళా ఉద్యోగులకు సన్మానం


హిందూపురంలో మహిళా న్యాయవాదులు, ఉద్యోగులతో కలసి కేక్ కట్ చేస్తున్న న్యాయమూర్తులు